ప్రజాశక్తి
బుధవారం 25 జూన్ 2025
5
శ్రీకాకుళం

## 28న జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 28వ తేదీన ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి శ్రీధర్ రాజా ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్‌పి నూతన సమావేశ మందిరంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి సంబంధించి ప్రజాప్రతినిధులకు అజెండా అంశాలను పంపించినట్లు తెలిపారు.

# ఆ శ్రద్ధ 'నేరడి'పై ఏదీ..?

- 'బనకచర్ల' ప్రాజెక్టుపై ప్రభుత్వం ఆసక్తి
- నేరడి ప్రాజెక్టుపై నిరాసక్తి
- రెండూ అంతర్రాష్ట్ర జల వివాదాలతో ముడిపడి ఉన్న అంశమే
- నేరడికి అనుకూలంగా ట్రిబ్యునల్ తీర్పు
- ఒడిశాలో బిజెపి ప్రభుత్వంతో చర్చలకు చొరవ చూపని కూటమి ప్రభుత్వం
- బనకచర్ల కోసం తెలంగాణతో కొట్లాట

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నేరడి బ్యారేజీ ప్రతిపాదిత నిర్మాణ ప్రాంతం

**రాష్ట్రంలో నిధుల కేటాయింపులు సరిగా లేక చాలా ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతోపాటు అంతర్రాష్ట్ర జల వివాదాలతో అపరిష్కృతంగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులూ ఉన్నాయి. వీటిని పూర్తి చేయడంపై దృష్టిసారించని టిడిపి కూటమి ప్రభుత్వం, కొత్తగా తెలంగాణతో జల వివాదం తెచ్చుకునేలా బనకచర్ల-గోదావరి ప్రాజెక్టును భుజానకెత్తుకుంది. వంశధార ట్రిబ్యునల్ తీర్పు అనుకూలంగా ఉన్నా, కేవలం రాజకీయ కారణాలతో ఏళ్ల తరబడి ఆగిపోయిన నేరడి బ్యారేజీపై ఒడిశాతో చర్చలు చేసేందుకు మాత్రం చొరవ చూపడం లేదు. ఒడిశాలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి కూటమి, కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఇలా అన్నిరకాల సానుకూల పరిస్థితులున్నా వాటిని వదిలేసి, బనకచర్ల కోసం ఆరాటపడుతోంది. ఇప్పటికే కేంద్ర జల సంఘానికి ప్రీ ఫీజుబులిటీ రిపోర్టు (పిఎఫ్‌ఆర్)ను పంపింది. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో ఉన్న పలుకుబడితో ప్రాజెక్టుకు అనుమతులు తెచ్చుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తోంది. అన్ని క్లియరెన్స్‌లు ఉన్న నేరడి బ్యారేజీ కోసం మాత్రం కించిత్ ప్రయత్నాలు చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

వంశధారలో లభ్యమయ్యే 115 టిఎంసిల నీటిలో 50 శాతం వినియోగించుకునేందుకు 1962 సెప్టెంబర్ 30న ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల మధ్య అంగీకారం కుదిరింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా భామిని మండలం కాట్రగడ వద్ద బ్యారేజీ నిర్మాణానికి ఒడిశా అంగీకారం తెలిపింది. 1986లో అప్పటి ఎపి ముఖ్యమంత్రి ఎన్టీఆర్, ఒడిశా సిఎం బిజూ పట్నాయక్ మధ్య ముఖాముఖి చర్చలు సైతం జరిగాయి. ఆ తర్వాత 2000లో అధికారంలోకి వచ్చిన ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజెడి, బిజెపి సంకీర్ణ ప్రభుత్వం నేరడి బ్యారేజీ నిర్మాణానికి రకరకాల అభ్యంతరాలనూ చెప్తూ వచ్చింది. ఒడిశా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సమస్యను నివేదించడంతో 2010లో కేంద్ర ప్రభుత్వం వంశధార ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. ఇరు రాష్ట్రాలను పలు సందర్భాల్లో సందర్శించిన ట్రిబ్యునల్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా బ్యారేజీ నిర్మాణానికి అనుమతినిస్తూ వంశధార నదీ జల వివాదాల ట్రిబ్యునల్ సెప్టెంబర్ 13, 2017లో తీర్పునిచ్చింది. బ్యారేజీ నిర్మాణానికి అవసరరమైన 106 ఎకరాలను సేకరించి ఇవ్వాలని ఒడిశా ప్రభుత్వాన్ని ఆదేశించింది. కేంద్ర జలవనరుల కమిషన్ ఆధ్వర్యాన ఆంధ్రప్రదేశ్, ఒడిశా ప్రభుత్వాలు ఉమ్మడిగా సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలని ట్రిబ్యునల్ సూచించింది. దీంతోపాటు భామిని మండలం కాట్రగడ నుంచి సైడ్‌వియర్ కెనాల్ నుంచి ఎనిమిది టిఎంసిల నీటిని వాడుకునేందుకు సైతం అవకాశం కల్పించింది.

### ఉమ్మడి సర్వేకు ఒడిశా నిరాకరణ

ట్రిబ్యునల్ ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపు నుంచి ఇంజినీరింగ్ అధికారులు సిద్ధమైనా, ఒడిశా నుంచి అధికారులు రాలేదు. పైగా మీరే భూమి వివరాలు చెప్తున్నారు కాబట్టి మీ దగ్గర ఉన్న క్షేత్రస్థాయి సమాచారం సరిపోతుందంటూ సర్వేకు సహకరించలేదు.

2019లో ఒడిశా అధికారులు సర్వేకు రాని విషయాన్ని ఎపి ఇంజినీరింగ్ అధికారులు 2019 ఏప్రిల్‌లో ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువెళ్లారు. 2019లో మేలో వచ్చిన ఫొని తుపాను వల్ల తమను వేర్వేరు ప్రాంతాలకు విధులకు కేటాయించడం వల్ల సర్వేకు వెళ్లలేకపోయామంటూ అప్పట్లో ఒడిశా ఇంజినీరింగ్ అధికారులు సాకులు చెప్పారు. దీంతో సర్వే ముందుకు సాగలేదు.

### రాజకీయ కారణాలతోనే అభ్యంతరాలు

వంశధార జల వివాదం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిపోవడానికి రాజకీయ అంశాలే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో వేర్వేరు రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడంతో చర్చలకు పెద్దగా చొరవ చూపలేదు. వైసిపి ప్రభుత్వ హయంలో కొంత ప్రయత్నం జరిగినా అవి ఫలించలేదు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 2021, నవంబర్‌లో భువనేశ్వర్ వెళ్లి ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో చర్చలు జరిపారు. ఇరు రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలతో ఒక కమిటీని సైతం ఏర్పాటు చేసినా ఫలితం దక్కలేదు.

### అతి తక్కువ ఖర్చుతోనే బ్యారేజీ పూర్తికి అవకాశం

ఒడిశాను ఒప్పిస్తే జిల్లాకు సాగునీటి వెతలు తీరనున్నాయి. జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు పైగా సాగునీరందించే అవకాశం ఉంది. ఖరీఫ్, రబీ సీజన్లలోనూ పంటలకు పుష్కలంగా సాగునీరు అందనుంది. వంశధార ఆయుకట్టు కింద ఉన్న భూములకు కరువు ఛాయలు లేకుండా చేయొచ్చు. బ్యారేజీ నిర్మాణానికి రూ.650 కోట్లు కేటాయిస్తే చాలు. జిల్లా ప్రజల చిరకాల స్వప్నం నెరవేరుతుంది. అటు ఒడిశాలోనూ 30 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. ఒడిశాతో చర్చలు జరిపితే వివాదం ఒక కొలిక్కి వచ్చే అవకాశమున్నా, కూటమి ప్రభుత్వం కనీసం చొరవ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# సాగు భూముల్లో ఏరువాక

- దళిత, పేదల భూముల జోలికొస్తే సహించేది లేదు
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - బూర్జ

ఏరువాక కార్యక్రమం చేపడుతున్న వ్య.కా.స రాష్ట్ర ప్రధాన కార్యర్శి వెంకటేశ్వర్లు

మండలంలోని అన్నంపేటలో దళిత, పేద రైతుల అనుభవంలో ఉన్న సాగు భూముల్లో మంగళవారం ఏరువాక కార్యక్రమం చేపట్టారు. ఈ భూములను భూస్వాములు బలవంతంగా లాక్కొనే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన దళితులు, రైతులు దుక్కి దున్ని విత్తనాలు చల్లారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దళిత, పేద రైతుల భూములను దౌర్జన్యంగా లాక్కొనే యత్నం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. 70 ఏళ్లుగా 25 దళిత, పేద రైతు కుటుంబాల సాగులో ఉన్న 26 ఎకరాల భూములను విశాఖపట్నానికి చెందిన భూస్వామి జెసిబిలతో చదును చేసి ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఆయనకు అధికార పార్టీ నాయకులతో పాటు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారని విమర్శించారు. గడిచిన 30 ఏళ్లలో దళితులు, బలహీనవర్గాలకు ఈ భూముల్లో ఎస్‌సి కార్పొరేషన్ బావులు తవ్వించిందని తెలిపారు. ఈ భూములపై ప్రభుత్వం బ్యాంకు రుణాలనూ అందజేసిందని గుర్తుచేశారు. దళితులు, పేదల రైతులకు ఈ భూములే జీవనాధారమన్నారు. రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు ఈ భూములపై పరిశీలన చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో జరిగిన సర్వేలు సరిచేస్తామని చెప్పి ఇప్పుడు దళిత, పేద రైతుల భూములను లాక్కోవడం ఎంతవరకు సమంజసమన్నారు. నెల రోజులుగా దళిత, పేద రైతులు పోరాడుతున్నా అధికారుల్లో స్పందన లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ భూములను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరవధిక దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, మండల కార్యదర్శి కంట అప్పలనాయుడు, రైతులు చిన్నయ్య, అప్పలస్వామి, రాజు, రవి, సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 5న జాతీయ లోక్ అదాలత్

**జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా**

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

జాతీయ లోక్ అదాలత్‌ను జూలై ఐదో తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా వెల్లడించారు. జిల్లా కోర్టుతో పాటు ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, సోంపేట, టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, కొత్తూరు, పొందూరు, పాలకొండ, రాజాం కోర్టుల్లో ఆరోజున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కోర్టు భవనంలో పోలీస్ శాఖ, ఎక్సైజ్, బీమా కంపెనీలు, చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి పని భారం తగ్గించుకోవాలన్నారు. పోలీసులు రాజీ పడదగ్గ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అయితే పోలీస్ యంత్రాంగానికి పెద్ద కేసులపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుందన్నారు. ఇన్సూరెన్స్ అధికారులు ఎక్కువ సంఖ్యలో మోటారు వాహన ప్రమాద కేసులను రాజీ చేయడం ద్వారా ప్రమాద బాధితులకు తక్షణము సహాయం అందే అవకాశం ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయితే ఇరు పక్షాలకూ గెలుపే ఉంటుందని తెలిపారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, మూడో అదనపు జిల్లా జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎం ఫణికుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, ఎఎస్‌పి కె.వి రమణ, పలువురు పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జీడి కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి

ప్రజాశక్తి - మందస

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, జీడి కార్మికులు

మందస జీడి కార్మికుల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు హెచ్చరించారు. ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జీడి కార్మికులు మంగళవారం నిర్వహించిన ర్యాలీకి సంఘీభావం తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి అధ్యక్షతన నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ జీడి కార్మికులు అతి తక్కువ వేతనాలతో దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యాలు కార్మిక చట్టాలను తుంగలో తొక్కి, తీవ్ర దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. 18 నెలలు గడిచినా యాజమాన్యాలు ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నాయన్నారు. మరోవైపు యాజమాన్యాలు అక్రమంగా వేరే ప్రాంతాల్లో జీడి పిక్కల కాల్పులు జరిపించి చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. 30 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు పని ఇవ్వకుండా అక్రమ పద్ధతిలో వేరే ప్రాంతాలకు తరలించడం చట్ట వ్యతిరేకమని, దీనిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం అండతో యాజమాన్యాలు తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. జీడి కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, వారాంతపు సెలవులు ఇవ్వాలని, ఇతర కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కార్మికశాఖ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించకపోతే దశల వారీ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజల మద్దతుతో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.కేశవరావు, జీడి సంఘం నాయకులు సిహెచ్.చంద్రమ్మ, సిహెచ్.జానకమ్మ, కె.శాంతమ్మ, కె.సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఇరాన్‌పై దాడిని ఖండిస్తూ నేడు నిరసన

**శ్రీకాకుళం సిటీ :** ఇరాన్‌పై అమెరికా దాడికి నిరసనగా ఈనెల 25వ తేదీన నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. వామపక్షాల, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

- నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు
- 27న రెవెన్యూ సదస్సు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ పౌర సేవల బాధ్యతను నిబద్ధతతో నెరవేర్చడంలో ప్రతి అధికారి సమర్థవంతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కారంపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో పలు శాఖల పరిధిలో ఫిర్యాదులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉండడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖలో సర్వీస్ లెవల్ అగ్రిమెంట్ (ఎస్ఎల్ఎ) కాలపరిమితి దాటి పెండింగ్‌లో ఉన్న కేసులపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఆయా మండలాల నుంచి మండల స్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. జిల్లాలో నమోదైన మొత్తం 31,037 ఫిర్యాదుల్లో 1,318 ఫిర్యాదులు ఎస్ఎల్ఎ దాటి పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో 188 కేసులు తిరిగి తెరుచుకున్నాయని తెలిపారు.

ఈ పెండింగ్ కేసుల్లో ఎక్కువ శాతం రెవెన్యూ, సర్వే, పంచాయతీ శాఖలకు చెందినవే ఉండడంపై ఆయా అధికారులను పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ శాఖలో మండలాల వారీగా 31,037 ఫిర్యాదులు నమోదయ్యాయని, ఇందులో 29,531 ఫిర్యాదులను పరిష్కరించగా, 1,179 ఎస్ఎల్ఎ లోపల, 139 ఎస్ఎల్ఎ దాటి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మొత్తంగా రెవెన్యూ శాఖలో ఐదు శాతం పెండింగ్ కనిపిస్తోందని చెప్పారు. టెక్కలి, గార, నందిగాం, రణస్థలం వంటి మండలాల్లో ఎస్ఎల్ఎ దాటి పెండింగ్ కేసులు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఆడిట్ ఫిర్యాదుల పరిష్కారంలో ఇప్పటికీ 149 కేసులు పెండింగ్‌లో ఉండటంపై ఆయన సంబంధిత అధికారులను వివరణ అడిగారు.

### 27న రెవెన్యూ సదస్సు

పెండింగ్ కేసుల పరిష్కారానికి సమగ్ర ప్రణాళికను రూపొందించేందుకు జూన్ 27న రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. ఈ సదస్సులో పెండింగ్ కేసుల పరిష్కారానికి ఒక టైమ్ ఫ్రేమ్‌ను విధించి, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని శాఖల అధికారులు తమ ఫిర్యాదులను ఆడిట్‌కు సిద్ధంగా ఉంచాలన్నారు. పౌరుల్లో విశ్వాసం పెంచేలా సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులపై నిర్లక్ష్యం ఏమాత్రం సహించబడదని పునరుద్ఘాటించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ బి.పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ పలు శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువు

ప్రజాశక్తి - పాతపట్నం

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా కరువయ్యాయని వైసిపి రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజలు భయం గుప్పిట్లో బతుకుతున్నారన్నారని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రతి రంగంలోనూ అస్థిరత, అవరోధాలు ఎదురవుతున్నాయని, ఇది శాంతిభద్రతలపై తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడుకు భద్రత, ప్రోటోకాల్ లభించగా, ప్రస్తుత ప్రభుత్వంలో మాజీ సిఎం వై.ఎస్ జగన్మోహన్ రెడ్డికి ఆ పరిస్థితి లేకుండా ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఇది వ్యక్తిగత అంశం కాదని, ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. రెడ్ బుక్ పాలనకు తావు లేకుండా, అన్ని రాజకీయ పార్టీల నాయకులకు సమానమైన గౌరవం, భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

# అంతర్రాష్ట్ర సరిహద్దులో ఎక్సైజ్ దాడులు

- 7,700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం
- 1520 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - పాతపట్నం



నాటుసారాను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో నాటుసారా తయారీ, అమ్మకాలపై ఇరు రాష్ట్రాల ఎక్సైజ్‌శాఖ అధికారులు సంయుక్తంగా మంగళవారం దాడులు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు మండలాల పరిధిలో, ఒడిశా గ్రామాలైన శిరడా, గురిసింగిగూడ, కొత్తగూడ, దిద్దినగూడ, తమిలగూడ తదితర గ్రామాల్లో దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో సుమారు 7,700 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 1520 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు.

శ్రీకాకుళం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, జిల్లా ఎక్సైజ్ అధికారి సిహెచ్.తిరుపతి నాయుడు, ఒడిశా రాష్ట్ర గంజాం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, గజపతి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ ఎక్సైజ్ ప్రదీప్ కుమార్ సాహు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నవోదయం 2.0లో భాగంగా పాతపట్నం మండలంలో సంపూర్ణంగా... కొత్తూరు, మెళియాపుట్టి మండలాల్లోని కొన్ని గ్రామాల్లో నాటుసారా తయారీని నిర్మూలించామని పాతపట్నం ఎక్సైజ్ స్టేషన్ మొబైల్ పార్టీ సిఐ కోట కృష్ణారావు తెలిపారు. ఒడిశా రాష్ట్రం నుంచి జిల్లాలోకి నాటుసారా రవాణా లేకుండా చేయడమే ఈ దాడుల ముఖ్య ఉద్దేశమన్నారు.

# రేపు ఎంఎస్ఎంఇలకు వర్క్‌షాప్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

యువతకు స్వయం ఉపాధి అవకాశాలను పరిచయం చేసేందుకు ఈనెల 26న ఉదయం 10.30 గంటలకు నరసన్నపేటలోని శ్రీరామ సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని ఫంక్షన్ హాలులో అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

డిఐసి, ఎపిఎస్ఎఫ్‌సి సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ వర్క్‌షాప్‌లో పారిశ్రామిక ప్రోత్సాహకాలు, పలు పాలసీలు, ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ వివరాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ప్రారంభించాలనుకునే ఔత్సాహికులకు ఈ వర్క్‌షాప్ ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలతో హాజరైన వారు ఉచితంగా రిజిస్ట్రేషన్ పొందవచ్చని, ఈ అవకాశాన్ని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని కోరారు.

ఆందోళన చేస్తున్న కార్మికులు

## శేషసాయి కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - రణస్థలం

మండలంలోని పైడిభీమవరం వద్ద ఉన్న శేషసాయి కెమికల్స్ పరిశ్రమలో అక్రమంగా తొలగించిన 11 మంది ఉద్యోగులను వెంటనే తీసుకోవాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. పరిశ్రమలో ఏకపక్షంగా నిలుపుదల చేసిన కార్మికులు మంగళవారం ఆందోళన చేపట్టారు. కార్మికులు పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేసింది. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ పరిశ్రమలో ఉద్యోగులకు, కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్, విడిఎ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు చేయాలన్నారు. కార్మిక చట్టాలు ఉల్లంఘిస్తూ తన ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఉద్యోగులను వేధింపులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. చట్టబద్ధ సౌకర్యాలు అమలు చేయాలని, వేతనాలు పెంచాలని కోరితే ఉద్యోగులపై బెదిరింపులకు పాల్పడుతూ అక్రమంగా 11 మంది ఉద్యోగులను నిలుపుదల చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. యాజమాన్యం వెంటనే కార్మికులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చట్టాలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యంపై అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనసేన నాయకులు వద్దాది శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కె.జనార్ధనరావు, ఎ.నారాయణరావు, సిహెచ్.అమ్మలనర్సయ్య, బి.రాజారావు, ఎం.అప్పలరాజు, జి.శేఖర్, ఆర్.పవన్, సీతారాం, ఐ.అప్పారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమేష్ పట్నాయక్

## దేశవ్యాప్త సమ్మెకు మద్దతు

ప్రజాశక్తి - ఆమదాలవలస

జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెకు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు మద్దతు ప్రకటించారని మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.రమేష్ పట్నాయక్ తెలిపారు. పట్టణంలోని మోతీరాం వారి వీధిలో మున్సిపల్ కార్మికుల మస్టర్ పాయింట్ వద్ద మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. గడిచిన కొద్ది రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో సమ్మె చేపడుతున్నట్లు వాటికి వివరించారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించని పక్షంలో పోరాటాలను ఉధృతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సమ్మె విజయవంతం చేయడానికి అందరూ సమిష్టిగా ఏకతాటి పైకి వచ్చి పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బలరాం, మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షులు తాడి సంతోష్ కె.తారకేశ్వరరావు, కె.వెంకటరావు ఎన్.రాజేష్ పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటి విద్యార్థులకు అభినందనలు

పలాస : విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పలాస

మండలంలోని బ్రాహ్మణతర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు జి.నిరోషా (నూజివీడు), సిహెచ్.హర్షిత (నూజివీడు), పి.బాలకృష్ణ (నూజివీడు), బి.హేమంత్ (శ్రీకాకుళం), ఎస్.ప్రణతి (శ్రీకాకుళం), ఎస్.ప్రణీత్ సాయి (ఇడుపులపాయ) ట్రిపుల్ ఐటికి ఎంపిక అయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తారకేశ్వర పండా, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే చిన్నబడాం ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.యామిని, దుర్గ, ఎస్.నాగవర్షిని, కుసుమాదేవి, డిక్కల యశస్విని ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు చింతాడ ఉషారాణి తెలిపారు. వీరికి హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు డి.కృష్ణమూర్తి, షణ్ముఖరావు, కె.గోవిందరావు, డి.శ్రీనివాసరావు, జి.జగదీశ్వరరావు, ఉమామహేశ్వరరావు, జయలక్ష్మిలు అభినందించారు.

**నరసన్నపేట:** మండలంలో కంబకాయ పాఠశాలలో చదివిన పట్టా సురేష్, బుద్దల సుస్మిత, గుజ్జిడి మోహితలు ట్రిబుల్ ఐటి ఎంపికయ్యారని ఉపాధ్యాయులు అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను అభినందించారు.

**కవిటి:** మండలంలోని పలు పాఠశాలల నుంచి పలువురు విద్యార్థులు ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించి సత్తా చాటారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి పవిత్ర, హాసిని, హర్షిత, బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బి.అఖిల, ఎం.ఉదయ్, ఎస్.ప్రసాద్, ఇ.గణేష్, జి.పవన్, బి.నరేష్, ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జల్లు అభిజిత్ ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నెయ్యల విశ్వనాథం, సనపల రామకృష్ణ, చిత్ర ఈశ్వరరావు అభినందించారు. ఎస్ఎంసి చైర్మన్ తెప్పల మోహనరావు, బల్లెడ శ్రీవిద్య, చిరంజీవమ్మ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో మరింతగా రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

**కొత్తూరు :** మండలంలోని మెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న ఐదు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు డి.ఎల్.నరసింహం తెలిపారు. ఒంగోలుకు ఎస్.లోకేష్, శ్రీకాకుళానికి టి.ఉదయ్‌కుమార్, నూజివీడుకు బి.హరిణి, ఎల్.లావణ్య, జె.శ్రావ్యలు ఎంపికైనట్టు తెలిపారు. వీరికి హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ జె.భానుమూర్తిలు అభినందనలు తెలిపారు.

**పాతపట్నం :** మండలంలోని తెంబూరు ఉన్నత పాఠశాలలో చదివి ట్రిబుల్ ఐటి పరీక్షలో నూజివీడులో సీటు సాధించిన సారవకోట మండలం వాండ్రాయిని నక్క బేబికి పాతపట్నం రామారావు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రామారాజు అధ్యక్షతన, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చదువుల విశ్వనాథం అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు మాజీ అధ్యక్షులు డోకిపర్తి షణ్ముఖరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, కె.వెంకటరమణ, బి.మాధవరావు పాల్గొన్నారు.

కవిటి : విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**ఆమదాలవలస :** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని చీపురి యామిని నూజివీడు ట్రిపుల్ ఐటిలో ప్రవేశం పొందిన సందర్భంగా పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ఎ.రాములు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి యుటిఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్‌లు యామినికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ పైడి రామస్వామి నాయుడు, సీనియర్ ఉపాధ్యాయులు సిహెచ్.సుబ్బలక్ష్మి, ఎన్‌సిసి చీఫ్ పి.మోహనరావు, ఉపాధ్యాయులు షేక్ షావలి బి.ఎ.శివరాజ్, జి.అప్పారావు, కె.ఈశ్వరరావు టి.సి.హెచ్.మనోహర్, ఎం.ఉమాకుమారి జి.కుమారి, ఎం.వి.ఆర్.బట్లు, బి. ధనలక్ష్మి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎఎన్‌ఎంలు

## మండల పరిధిలోనే బదిలీ చేయాలి

ప్రజాశక్తి - పొందూరు

గ్రామ సచివాలయ ఉద్యోగులకు స్థానిక మండలాల పరిధిలోనే బదిలీలకు అవకాశం కల్పించాలని ఎఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. మంగళవారం పొందూరు, కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులకు వినతిపత్రాలను అందజేశారు. వార్డు సచివాలయ ఉద్యోగులకు స్థానిక మున్సిపాలిటీల్లోనే బదిలీకి అవకాశం కల్పించారని, కానీ, గ్రామ సచివాలయ ఉద్యోగులకు మండలం పరిధిలో బదిలీలకు అవకాశం కల్పించలేదని అన్నారు. ఒకేశాఖకు చెందిన ఉద్యోగులకు రెండు రకాలుగా నిబంధనలు ఉండడం సమంజసం కాదని అన్నారు. స్థానిక మండలాల్లోనే గ్రామ సచివాలయ ఉద్యోగులకు బదిలీకి అవకాశంపై పునరాలోచించాలని కోరారు. ఇందులో పలు గ్రామ సచివాలయ ఎఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సర్వేయర్లు

## సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాతపట్నం

ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసినా ఎటువంటి పరిష్కారం చూపలేదని, రేషన లైజేషన్, బదిలీల ప్రక్రియ అమలు చేసే విధానంలో తమకు నష్టం వాటిల్లుతుందని గ్రామ సర్వేయర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఉదయ్‌కుమార్, కె.షణ్ముఖరావు, ఎ.అనిల్ అన్నారు. ఈ మేరకు తహశీల్దార్ నందిగాం ప్రసాదరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీ సర్వే చేస్తున్న సర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలన్నారు. జనాభా ప్రాతిపదికన కాకుండా రెవెన్యూ విలేజ్ విస్తీర్ణం మేరకు హేతుబద్ధీకరణ చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పి.ఈశ్వరమ్మ, పి.మన్మథ, ఎం.రుకేంద్రరావు, ఎ.నీలవేణి, ఆర్.యుమున పాల్గొన్నారు.

## భవన నిర్మాణాలపై శ్రద్ధ చూపాలి

**టెక్కలి:** టెక్కలిలో నూతనంగా నిర్మిస్తున్న మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు భవనాలు నిర్మాణంపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నీటి సంఘ మాజీ అధ్యక్షులు సత్తారు వెంకటరమణ ఒక ప్రకటనలో కోరారు. పాత జిల్లా వంద పడకల ఆస్పత్రి భవనాలను, వైద్యుల క్వార్టర్స్ భవనాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కంకరబందలో నిర్మాణానికి రెవెన్యూ అధికారులు ఏ విధంగా అనుమతులు మంజూరు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. టెక్కలిలో ప్రభుత్వ ఆస్తులను కాపాడి వాటి స్థానంలో కార్యాలయాలను నిర్మించాలని కోరారు.

# మా టీచర్‌ని బదిలీ చేయొద్దు

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మూడేళ్ల విధులు నిర్వహించి విద్యార్థుల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న సంఘటన చోటుచేసుకుంది. అప్పటివరకు ఆ పాఠశాలలో కేవలం పది నుంచి 15 మంది విద్యార్థులు ఉండే ఆ పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధుల్లో చేరిన వ్యక్తి ప్రస్తుతం మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కంటే అత్యధిక విద్యార్థుల సంఖ్య కలిగిన పాఠశాలగా గుర్తింపు తీసుకొచ్చారు. ఈ ఉపాధ్యాయుడు వచ్చిన తర్వాత పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రయివేటు పాఠశాలల్లోని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా మారారంటే ఆ ఉపాధ్యాయుడి విధి నిర్వహణ నిబద్ధత ఇట్టే అర్థమవుతుంది. వివరాల్లోకి వెళ్తే... సరుబుజ్జిలి పంచాయతీ నందికొండ ప్రాథమిక పాఠశాలలో బి.శ్రీనివాసరావు ఎంటిఎస్ ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తుండగా, జిల్లా విద్యాశాఖ ఈయనను సంతబొమ్మాళి మండలం బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ చేసింది. నందికొండ పాఠశాలలో విధులు నిర్వహించిన శ్రీనివాసరావు విధి నిర్వహణకు ఆకర్షితులైన నందికొండ గ్రామస్తులు ఆయనపై ప్రత్యేక నమ్మకాన్ని పెట్టుకోవటంతో ఈ ఏడాది 46 మంది విద్యార్థులు పాఠశాలలో ఉన్నారు. ప్రస్తుతం ముగ్గురు

టీచర్‌ను కొనసాగించాలని నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఉపాధ్యాయులు ఉన్న ఈ పాఠశాల నుంచి ఇటీవల ఒక పేద విద్యార్థి వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికయ్యాడు. దీంతో నందికొండ పాఠశాలపై ఆశలు పెంచుకున్న తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉపాధ్యాయడు శ్రీనివాసరావు ఆధ్వర్యాన మంచి విద్యా బుద్ధులు అలవడుతాయన్న నమ్మకంతో ఉన్న సమయంలో ఉపాధ్యాయుడు బదిలీతో ఆ ఆశలు తల్లిదండ్రుల లో ఆవిరయ్యాయి. దీంతో మంగళవారం సర్పంచ్ బొడ్డేపల్లి చాందిని, వెంకట సూర్య, విద్యా కమిటీ చైర్మన్ మండ సుదర్శనరావు, టిడిపి నాయకుడు దవళ సింహాచలం ఆధ్వర్యాన విద్యుతలు, తల్లిదండ్రులు కలిసి శ్రీనివాసరావును ఇక్కడే ఉంచాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంఆర్‌సి వద్ద నిరసన తెలిపారు.

## అడ్మిషన్లు ఫుల్

ప్రజాశక్తి - టెక్కలి

టెక్కలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బాలికల జూనియర్ కళాశాలకు డిమాండ్ పెరిగింది. గడచిన మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ప్లస్-2 కళాశాలలో ఈ ఏడాది ఇంటర్ విద్యార్థులకు అడ్మిషన్లు లేవని కళాశాల అధ్యాపకులు బోర్డు పెట్టి ప్రవేశాలకు రావద్దని కోరడం గమనార్హం. వాస్తవంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలపై విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపని దాఖలాలు ఉన్నాయి. కానీ ప్లస్-2 కళాశాలలో ప్రవేశానికి మాత్రం ఈ ఏడాది డిమాండ్ పెరిగింది. ఈ కళాశాల్లో ఎంపిసి, బైసిపి రెండు గ్రూపులు మాత్రమే ఉన్నాయి. ఒక్కొక్క గ్రూపుకి 44 సీట్లు చొప్పున్న కేటాయించారు. రెండు గ్రూపుల్లోనూ ప్రవేశాలు విద్యా సంవత్సరం ఆరంభంలోనే పూర్తికావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

సీట్లు లేవని తెలియజేస్తూ ఏర్పాటు చేసిన బోర్డు

సన్మానిస్తున్న రాజు

## ఆర్మీ లెఫ్టినెంట్ అధికారికి సన్మానం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలంలో మశాఖపురానికి చెందిన ఆశి సంతోష్‌కుమార్‌రెడ్డి భారత్ సైనిక దళంలో అత్యుత్తమ పదవి లెఫ్టినెంట్ అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టారు. మంగళవారం తొలిసారిగా స్వగ్రామానికి వచ్చారు. తల్లిదండ్రులు లక్ష్మీనారాయణరెడ్డి, తల్లి మేనక, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సంతోష్‌కుమార్, తారక్, ప్రతాప్, కాళి, కృష్ణమూర్తి, కిరణ్, ప్రభాకర్, ప్రేమ్, జగదీష్ పాల్గొన్నారు.

## శిష్టకరణ సంఘ మండల అధ్యక్షునిగా అశోక్

ప్రజాశక్తి - పాతపట్నం

అశోక్

పాతపట్నం మండల శిష్టికరణ సంఘం అధ్యక్షునిగా రావాడ అశోక్ పట్నాయక్‌ను మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండలం శిష్టి కరణ సంఘాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా అశోక్ పట్నాయక్, కార్యదర్శిగా బెహరా నాగేశ్వరావు, వైస్ ప్రెసిడెంట్ రఘుపాత్రుని తులసీరావు పట్నాయక్, సహాయ కార్యదర్శిగా తోనంగి రాజా శేఖర్ పట్నాయక్, కోశాధికారి కంటుమహంతి జీవేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా బెహరా శ్రీను, రాము పట్నాయక్, లింగుమహంతి శ్రీను, లింగుమహంతి తవుడుబాబు, రావాడ కృష్ణ, చక్రమహంతి రాజు, వెంకుమహంతి మహేష్, జడ్డు మహంతి రాంబాబులను ఎన్నుకున్నారు.

## బదిలీ ఉపాధ్యాయునికి సన్మానం

**లావేరు :** మండలంలోని బుడుమూరు ఉన్నత పాఠశాలలో పనిచేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు కరవంజ చంద్రశేఖర్ ఇటీవల బదిలీ అయ్యారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు మంగళవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఉపాధ్యాయుడు చేసిన సేవలే సన్మానం చేసేందుకు దోహదపడతాయని ప్రధానోపాధ్యాయులు రువ్వ పూర్ణచంద్రరావు అన్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ పాఠశాల నుంచి బదిలీ బాధగా ఉందని, విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని కోరారు.

సన్మానిస్తున్న హెచ్ఎం పూర్ణచంద్రరావు

# అల్లెన పాఠశాలను విలీనం చేయొద్దు

మాట్లాడుతున్న ఎంపిపి దీప

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని అల్లిన పాఠశాల విలీనం ఆపాలని సర్పంచ్ ప్రతినిధి జడ్డు మహేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దీప అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లినలోని పాఠశాలలో 70 మంది విద్యార్థులు ఉన్నారని అన్నారు. 6, 7, 8 తరగతుల పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, పాలవలస జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చేరాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. దీంతో తమ గ్రామానికి చెందిన సుమారు 40 మంది విద్యార్థులు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారని తెలిపారు. దీంతో డ్రాప్ అవుట్స్ పెరిగే అవకాశం ఉందని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎఒ ఉషారాణి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు పంపిణీ చేశామని, ఎరువు కూడా అందజేస్తామని తెలిపారు. బూర్జ పిహెచ్‌సి వైద్యాధికారి రాజశేఖర్ మాట్లాడుతూ ఈ ఏడాది విస్తరంగా వర్షాలు కురుస్తున్నాయని, ప్రతిఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రత పాటించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తున్నామని, బీచింగ్ జల్లి శుభ్రత చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బి.రామారావు, వైస్ ఎంపిపిలు గుడిమూరు సూర్యారావు, కృష్ణంనాయుడు, ఎంపిడిఒ తిరుపతిరావు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే కీలకం

ప్రజాశక్తి - రణస్థలం

వైసిపి కార్యాకర్తలకే కీలకమని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో తెప్పలవలస పంచాయితీ కార్యకర్తలతో 'కార్యకర్తే కీలకం' సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసే వ్యక్తి కార్యకర్తే అని కొనియాడారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. కూటమి ప్రభుత్వంపై ఏడాది గడవకముందే వ్యతిరేకత మూటగట్టుకుందని

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దన్నాన హరి, సర్పంచ్ ప్రతినిధి బొమ్మలాట శ్రీరాములు పాల్గొన్నారు.

# మత్తుకు బానిస కాకూడదు

కోటబొమ్మాళి : అవగాహన కల్పిస్తున్న జడ్జి రోషిణి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ సివిల్ జడ్జి ఎం.రోషిణి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభం, శుభం తెలియని విద్యార్థులతో మాదక ద్రవ్యాలను విక్రయాలు చేయిస్తున్నారని, ఇది తెలియక విద్యార్థులు బలైపోతున్నారని అన్నారు. అందుకోసం కొంతమంది మాయమాటల్లో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలతో పట్టుబడితే జైలు శిక్ష పడుతుందని తెలిపారు. దీంతో జీవితం నాశనమైపోతుందని అన్నారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్. హెల్మెట్ లేని ప్రయాణం చేసి కోరి కష్టాలు తెచ్చుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినాన శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ అరంగి అప్పన్న, ఎస్ఐ 2 పాల్గొన్నారు.

**టెక్కలి :** మాదకద్రవ్యాలు వినియోగం ప్రాణాంతకమని, వాటికి దూరంగా ఉండాదలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ పిలుపునిచ్చారు. ఈగల్‌టీం ఆధ్వర్యాన పట్టణంలో విద్యార్థులతో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ కాంప్లెక్స్ వరకు సాగింది. మాదకద్రవ్యాలు వినియోగంపై టెక్కలి ఎస్ఐ రఘునందరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ లూక్‌పాల్, డాక్టర్ పి.వి.ఎన్.ఆచార్యులు, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

టెక్కలి : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పవన్

# జిజెసి విద్యార్థులకు ర్యాంకుల పంట

ప్రజాశక్తి - నరసన్నపేట

ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేటలో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో సత్తా చాటారు. కర్నూలులోని సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలకు రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులు పోటీపడతారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన కళాశాలలో డిగ్రీ చేరేందుకు గత నెలలో నిర్వహించిన సిల్వర్ సెట్ 2025 పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ పవన్ తెలిపారు. ఇఇసి గ్రూప్ చదివిన కొంకి రాంబాబు 42వ ర్యాంకు రాగా, అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్ (ఒకేషనల్) గ్రూప్ చదివిన ముగ్గురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. వాడవలస రామకృష్ణకు 135వ ర్యాంకు, బోర శర్మిలకు 152వ ర్యాంకు రాగా, పీట యమునకు 414వ ర్యాంకు (స్పోర్ట్స్ కోటా) వచ్చాయన్నారు. ఇటీవల విడుదలైన ఎపిఆర్‌డిసి ఎంట్రన్స్ ఫలితాల్లో అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్ (ఒకేషనల్) గ్రూపు విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. ఎ అండ్ టి గ్రూపు చదివిన బుడ్డాల రవీంద్ర, వాడవలస రామకృష్ణ, ఉంగటి లాలూప్రసాద్‌లకు నాగార్జున సాగర్‌లోని డిగ్రీ కళాశాలలో బికాం సీట్లు లభించాయని తెలిపారు. తమ విద్యార్థులు కర్నూలు సిల్వర్ జూబ్లీకి నలుగురు, నాగార్జున సాగర్ డిగ్రీ కళాశాలకు ముగ్గురు ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తంచేశారు. ఎ అండ్ టి వృత్తివిద్య అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి, జిఎఫ్‌సి కూన హరిప్రసాద్, స్వర్ణలత, ఆనందరావు విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చి ర్యాంకులు సాధించేలా కృషి చేస్తున్నారని అభినందించారు. డాక్టర్ మల్లేశు, రూపవతి, సత్యనారాయణ, జోశ్యుల హరిప్రసాద్ సహాయ సహకారాలు అందించారు. లైబ్రరీ సైన్స్ అధ్యాపకులు జె.వదనగిరి, అధ్యాపకులు విశ్వప్రసాద్, శివరాం ప్రసాద్, నాగకుమారి హర్షం వ్యక్తం చేశారు.

# సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - కవిటి

అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించి తమకు న్యాయం చేయాలని సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఎంపిడిఒ శ్రీనివాస రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల బదిలీల కోసం ఇచ్చిన జిఒ 5ను సవరించి, గ్రామ సచివాలయ ఉద్యోగులకు సొంత మండలాల్లో (సొంత పంచాయతీలు కాకుండా) బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. అలాగే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు జరగబోయే బదిలీలు అత్యంత పారదర్శకంగా నిర్వహించి సీనియార్టీ, మెరిట్ ఆధారంగా బదిలీలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం కల్పించి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రొబేషన్ డిక్లరేషన్ ఆలస్యంగా చేసినందు వల్ల రావాల్సిన బకాయిలు ఇవ్వాలని కోరారు. అదే సమయంలో సచివాలయ ఉద్యోగులకు స్పష్టమైన సర్వీస్ రూల్స్ రూపొందించి, మెరుగైన ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తింపజేయాలని కోరారు. మహిళా పోలీసులకు కచ్చితమైన డిపార్ట్‌మెంట్ కేటాయించి, దానికి అనుగుణంగా జాబ్ ఛార్ట్, ఉద్యోగులు కల్పించాలని కోరారు. ఉద్యోగులకు సర్వేల నుంచి విముక్తి కల్పించి, పని ఒత్తిడిని తగ్గించాలని వారు కోరారు. కార్యక్రమంలో పొల్లాయి అశోక్, జయకృష్ణ, లోళ్ల విజయ్, పూర్ణచంద్ర, జోగమ్మ, చాణిక్య, కోటేష్, కర్ణరావు, శారద, సుశీల, ఉషారాణి పాల్గొన్నారు.

పలాస : నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

**పలాస :** మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీలపై స్పష్టత ఇవ్వాలని ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పలాస మున్సిపల్ కార్యాలయం వద్ద సచివాలయం ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావుకు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియారిటీ ఆధారంగా ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బడే చక్రధర్, లావణ్యకుమార్, డి.హేమశంకర్, గాలి ముకుందరావు, వి.రాజశేఖర్, జి.రోజా పాల్గొన్నారు.

నిందితుడిని ప్రవేశపెట్టిన సిఐ చిన్నంనాయుడు

## హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలంలోని మండపల్లిలో మామ గంగయ్యను హత్య చేసిన కేసులో అల్లుడు పాతర్ల దశరథరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిని మంగళవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండపల్లికి చెందిన గంగయ్య పెద్ద కుమార్తె ఉల్లమ్మతో అదే గ్రామానికి చెందిన దశరథరెడ్డితో 2014లో వివాహమైందన్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. పెళ్లయిన సంవత్సరం తరువాత నుంచి దశరథరెడ్డి మద్యానికి బానిసై భార్య, పిల్లలను పట్టించుకోకుండా ఉండేవారని అన్నారు. ఈ విషయమై వారి మధ్య మనస్పర్థలు రావడంతో ఉల్లమ్మ తన పిల్లలతో కన్నవారింటికి వెళ్లిపోయిందన్నారు. దశరథరెడ్డి చక్కగా చుకుంటానని చెప్పి భార్య, పిల్లలను ఇంటికి తీసుకెళ్లారని అన్నారు. కొద్ది రోజుల తరువాత దశరథరెడ్డి విధులు వెళ్లడానికి బైక్ కావాలని భార్యతో గొడవ పడ్డారని అన్నారు. భార్య డ్వాక్రా పొదుపు డబ్బులు రూ.50 వేలుతో బైక్ కొనుగోలు చేసిందని తెలిపారు. ఆ తరువాత నుంచి ఎప్పటిలాగే మద్యం తాగి భార్య, పిల్లలను పట్టించుకోకుండా బరంపురంలోనే ఎక్కువగా ఉండేవాడని అన్నారు. మళ్లీ ఉల్లమ్మ తన పిల్లలతో ఏడాది కాలంగా కన్న వారింటి వద్దనే ఉంటుందన్నారు. సుమారు రెండు నెలల క్రితం దశరథరెడ్డి గ్రామానికి వచ్చి ఉల్లమ్మను కాపురానికి తీసుకెళ్తానని మామ గంగయ్యను కోరారని తెలిపారు. మామ మందలించడంతో ఆయనపై కక్ష పెంచుకుని ఈ నెల 17న కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు తెలిపారు.

### వ్యక్తికి గాయాలు

**టెక్కలి రూరల్ :** టెక్కలి ఎన్‌టిఆర్ కాలనీకి చెందిన ఎం.వెంకటరమణ మంగళవారం రైలు నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. భవన నిర్మాణ కార్మికునిగా పనులు చేస్తున్నాడు. పనుల నిమిత్తం రైలు ఎక్కివ వెళ్తున్నాడు. టెక్కలి వైపు వచ్చే రైలు నుంచి లక్ష్మీపురం సమీపంలో జారిపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా రిమ్స్‌కు తరలించారు.

చికిత్స పొందుతున్న వెంకటరమణ

విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రదీప్

## నైతిక విలువలు అవసరం

**టెక్కలి :** విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు, ఆత్మస్థైర్యం అవసరమని సీనియర్ సినీ నటుడు, దర్శకుడు ప్రదీప్ కొండిపర్తి అన్నారు. మంగళవారం టెక్కలి వచ్చిన ఆయన స్థానిక మదర్ థెరిసా జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. తల్లిదండ్రులు విద్యార్థులపై స్నేహభావంతో మెలగాలన్నారు. లింగ వివక్ష, బేదం లేకుండా ఇద్దరినీ సమానంగా చూడాలన్నారు. కుటుంబంలో ఇద్దరు పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అవసరమన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిభ కలిగిన గ్రామీణ ప్రాంత యువకులకు సినీ పరిశ్రమలో ఆవకాశాలున్నాయన్నారు. దర్శకుడు హస్యబ్రహ్మ జంద్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి తనకు తండ్రితో సమనామన్నారు.

## తెల్లదోమ తినేస్తోంది

**ప్రజాశక్తి- కవిటి**

వినతిపత్రం అందజేస్తున్న కిరణ్ కుమార్

ఉద్దానం ప్రాంతంలో తెల్లదోమ కొబ్బరి పంటను అతలాకుతలం చేస్తోందని, దోమ నివారణకు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఉద్దానంలో కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం, పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో తెల్లదోమ ప్రభావంతో కొబ్బరి దిగుబడి తగ్గి రైతులు పూర్తిగా నష్టపోయినట్టు తెలిపారు. దీనిపై పరిశోధన చేసి ఉద్దాన ప్రాంత రైతులను ఆదుకోవాలని కోరారు. అదే సమయంలో ప్రభుత్వం డ్రోన్ల ద్వారా తెల్లదామ నివారణ కు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు కిరణ్ కుమార్ తెలిపారు.

## శుద్ధ జల యంత్రాలు అందజేత

**వజ్రపుకొత్తూరు:** పాఠశాల విద్యార్థులు, అంగన్వాడీ చిన్నారులకు అందించిన శుద్ధ జల యంత్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎంసి చైర్మన్ కంబాల శివాజీ అన్నారు. కంబాలరాయుడుపేటలో గల్ఫ్ యూత్ ప్రతినిధులంతా కలిసి స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలకు రెండు శుద్ధజల యంత్రాలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లఖినాన కరుణాకర్, గల్ఫ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## గిరిజనుల అభివృద్ధికి కృషి

**మెళియాపుట్టి :** గిరిజనులు అన్ని విధాల అభివృద్ధి చెందాలని జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా అన్నారు. మండలంలోని బందపల్లిలో జన జాతీయ గౌరవ దివాస్ వేడుకల్లో భాగంగా మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభల ద్వారా వివరాలు సేకరించి గిరిజనుల అభివృద్ధికి కృషికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో డిటి రాము, సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, ఎపిఎం త్రినాథమ్మ, మాజీ వైస్ ఎంపిపి దినకర్, సర్పంచ్ గూడ వసంతకుమారి, పాపారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి, ఎంపిడిఒ

# వార్డు సభ్యుల వాకౌట్

**ప్రజాశక్తి- నరసన్నపేట**

ప్రశ్నిస్తున్న వార్డు సభ్యులు

నరసన్నపేట మేజర్ పంచాయతీ పాలకవర్గ సమావేశం అర్ధాంతరంగా వాయిదా పడింది. పంచాయతీ కార్యాలయంలో ఇఒ ద్రాక్షాయిని, బి.శంకర్ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సరైన సమాధానాలు చెప్పకపోవడంతో వార్డు సభ్యులు సమావేశం నుంచి వాకట్ చేశారు. పంచాయతీ పరిధిలో పారిశుధ్య లోపంపై సభ్యుల ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులు విధులకు సక్రమంగా హాజరు కాకపోవడం వల్ల చిన్నచిన్న లోపాలు ఏర్పడుతున్నాయని, వాటిని సరిచేస్తామని అధికారుల హామీ ఇచ్చారు. పంచాయతీకి మొండి బకాయి దారుల నుంచి కోట్ల రూపాయలు పన్నుల రూపంలో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వసూలు చేయడంలో సిబ్బంది తాత్సారం చేస్తున్నారని సభ్యులు మండిపడ్డారు. ఆసీలు వసూలు వేలం పా ట దా ం ల ం పంచాయతీకి పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్నారని, వారి నుంచీ రావలసిన బకాయిలు రావడంలేదని, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పంచాయతీ కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోతుందని అన్నారు. ప్రతిసారీ సభ్యులు ప్రశ్నించడమే తప్ప సిబ్బంది పనులు నిర్వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రశ్నలన్నింటికీ అధికారులు సరైన సమాధానాలు చెప్పకపోవడంతో వార్డు మెంబర్లు వాకౌట్ చేశారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక సమావేశం అర్ధాంతరంగా వాయిదా వేశారు.

# విద్యుత్ కనెక్షన్లు లేక అవస్థలు

**ప్రజాశక్తి- టెక్కలి రూరల్**

టెక్కలిలో నిర్మించిన హుదూద్ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని జెడ్‌పిటిసి దువ్వాడ వాణి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఆట్ల సరోజమ్మ అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో 96 ఇళ్లు పేదలకు పంపిణీ చేసిందని, మండల పరిషత్ నిధుల నుంచైనా విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని ఎంపిడిఒ ఫణీంద్రకుమార్‌ను కోరారు. మండలంలో టిడిపి ప్రభుత్వం విత్తనాలు సరఫరా చేయలేదని, దీంతో రైతులు బయట కొనుక్కోవాల్సి పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మండలంలోని రైతులకు సరిపడే విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని ఎఒ శ్రీనివాసరావుకు సూచించారు. టెక్కలి పంచాయతీలో కుక్కల బెడద, విద్యుత్ దీపాలు లేకపోవడంతో అంధకారం ఉందని, అపారిశుధ్యం రాజ్యమేలుతుందని సభ దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు స్పందించకపోతే నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు సత్తారు ఉషారాణి, కూనపార్వతి, పీత హేమలత, బెండి దేవయాని, కె.కొత్తూరు పిహెచ్‌సి వైద్యాధికారులు ఎస్.గాయత్రి, భాగ్యశ్రీ, ఎంఇఒ దల్లి తులసీరెడ్డి, ఎపిఒ బగాది ప్రసాదరావు, ఎపిఎం ఉమారాణి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి వాణి

# జాబ్‌మేళాలో 189 మంది ఎంపిక

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

**శ్రీకాకుళం సిటీ:** శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాలలో నోడల్ రిసోర్స్ సెంటర్, జ వహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యాన మంగళవారం కెరీర్ సొల్యూషన్స్ సంస్థ జాబ్‌మేళా నిర్వహించింది. ఈ జాబ్‌మేళాకు 298 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కాగా, 189 మంది అభ్యర్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు అభినందించారు. విద్యార్థుల ఉద్యోగ, ఉపాధికి అవసరమైన నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెకెసి కో-ఆర్డినేటర్ లక్ష్మి, కెరీర్ సొల్యూషన్స్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ ఎస్.వాణీకుమారి, డాక్టర్ ఎన్.రామకృష్ణ పాల్గొన్నారు.

## పాఠశాల సందర్శన

**ప్రజాశక్తి- నరసన్నపేట**

మధ్యాహ్న భోజన పథకం అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న మెనూ తప్పనిసరిగా పాటించాలని డిప్యూటీ డిఇ విజయకుమారి ఆదేశించారు. మండలంలోని దేశవానిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాదరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

భోజనాన్ని పరిశీలిస్తున్న విజయకుమారి

## పిఎండిఎస్ పద్ధతి మేలు

**పాతపట్నం:** ప్రకృతి వ్యవసాయంలో ప్రి మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిలో వేసిన 32 రకాల విత్తనాల పశుగ్రాసం పాడి పశువులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు అభిప్రాయపడ్డారు. మండలంలో బడ్డుమర్రి లో మంగళవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పశుగ్రాసాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి సాగైన తర్వాత భూములన్ని ఖాళీగా ఉంటున్నాయని, దానివల్ల వేసవి తర్వాత వేసిన పంటకు పోషక విలువలు అందక దిగుబడి తక్కువగా వస్తున్నదని చెప్పారు. అందువల్ల వేసవికాలంలో భూమి ఖాళీగా ఉండకుండా 32 రకాల విత్తనాలతో పశుగ్రాసాన్ని సాగు చేసి, దానిని పశువులకు మేపి తద్వారా అధిక పాల దిగుబడి సాధించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పెద్దలోగిడి పశు వైద్యాధికారి కె.మౌనిక, సిబ్బంది నిరంజన్, మోహన్, బ్రెడ్ సంస్థ ప్రతినిధులు కొజ్జి సూర్యనారాయణ, బెజ్జిపల్లి నీలకంఠరావు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

## అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా

**పలాస :** మున్సిపాలిటీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేయాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పలాస మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం తమ సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 25 ఏళ్లుగా మున్సిపాలిటీలోని వివిధ శాఖల్లో పనులు చేపడుతున్నామని తెలిపారు. ఉద్యోగ భద్రత లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్న తరుణంలో ప్రభుత్వ పథకాలకు సైతం నోచుకోవడం లేదని వాపోయారు. తమకు రూ.15 వేలు జీతమంటూ... రూ.13 వేలు బ్యాంకు ఖాతాల్లో జమవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బద్రి సోమేశ్వరరావు, మాధవరావు, సత్యనారాయణ, సురేష్, శ్రీను, వనజాక్షి, సుధ, కామేశ్వరరావు, సురేంద్ర పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

## స్టేడియంను అభివృద్ధి చేయాలి

**పోలాకి :** నరసన్నపేట పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. అమరావతి వెలగపూడి సచివాలయంలో బ్లాక్ -4 భవనంలో ఆంధ్రప్రదేశ్ క్రీడాశాఖ మంత్రి శ్రీమండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నరసన్నపేట పట్టణంలోని ఇండోర్ స్టేడియం పూర్తి చేసేందుకు ఉన్న నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న విఆర్ఎలు

## కనీస వేతనం అమలుకు వినతి

**పలాస :** గ్రామ రెవెన్యూ సహాయకులకు కనీస వేతనం అమలు చేయాలని విఆర్ఎ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద చేపడుతున్న ధర్నా నేపథ్యంలో తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తికు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ అర్హత ఉన్న విఆర్ఎలకు విఆర్ఒగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్ఎలుగా నియమించాలని కోరారు. అటెండర్, నైట్‌వాచ్‌మెన్ ఉద్యోగోన్నతి కోటాను 20 నుంచి 70 శాతానికి పెంచాలన్నారు. అక్రమ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విఆర్ఎ సంఘం అధ్యక్షుడు సిహెచ్.లక్ష్మణరావు, కార్యదర్శి బి.తిరుపతిరావు, సిహెచ్.సింహాచలం పాల్గొన్నారు.

## ఎత్తురాళ్లపాడులో విత్తనశుద్ధి

**కోటబొమ్మాళి:** ఖరీఫులో వరిసాగుకు ఏటా సోకే కుళ్లు తెగులు, అగ్గి తెగులు నివారణకు కేజీ వరి విత్తనాలకు 8-10 గ్రాముల సూడోమోనప్ మందును కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలని ఎఒ ఎస్.గోవిందరావు తెలిపారు. మండలంలోని ఎత్తురాళ్లపాడులో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.